ప్రజాశక్తి

శుక్రవారం 12 జులై 2024

అనంతపురం





బాధ్యతలు స్వీకరిస్తున్న పయ్యావుల కేశవ్




కేశవ్‌ను అభినదిస్తున్న కాలవ శ్రీనివాసులు

బాధ్యతలు స్వీకరించిన పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-వజ్రకరూరు

రాష్ట్ర సచివాలయంలోని రెండో బ్లాకులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగా ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో జవాబుదారీ తనంతో కూడిన పారదర్శకమైన పాలనను రాష్ట్ర ప్రజలకు అందించేందుకు కషి చేస్తామన్నారు. బాధ్యతలు చేపట్టిన మంత్రి రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కలిసి అభినందనలు తెలిపారు.

ముందుకు సాగని సాగు..!



◆ పదును కోసం ఎదురు చూపులు

◆ ఉమ్మడి జిల్లాలో 13 శాతంలోనే విత్తనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు 13 శాతం లోపే విత్తనం పడింది. సాధారణంగా 15.82 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే ఇప్పటి వరకు రెండు లక్షల ఎకరాల్లోపే విత్తనం పడింది. తక్కిన భూమి అంతా ఇంకా బీడుగానే ఉంది. జూన్‌లో పడిన వర్షాలను చూసి రైతులు ఖరీఫ్ సాగుకు అన్ని విధాలుగా సన్నద్ధమై ఉన్నారు. విత్తనం వేసుకుందామంటే పదును కాక ఆగిపోయింది. ఇందులో ప్రధాన పంట అయిన వేరుశనగ అనంతపురం జిల్లాలో 4.88 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది విత్తనం పడుతుదని అంచనా వేశారు. ఇప్పటి వరకు విత్తనం పడింది కేవలం 36,590 ఎకరాల్లో మాత్రమే. ఇక సత్యసాయి జిల్లాలో 4.32 లక్షల ఎకరాలకుగానూ 80 వేల ఎకరాల్లోనే వేరుశనగ సాగైంది. కంది పంట అనంతపురం జిల్లాలో సాధారణ సాగు 50 వేల ఎకరాలకుగానూ 6879 ఎకరాల్లో విత్తనం పడింది. సత్యసాయి జిల్లాలో ఈ పంట 51 వేల ఎకరాలకుగానూ తొమ్మిది వేల ఎకరాల్లోనే విత్తనం పడింది. ఆముదం సాధారణ సాగు 40 వేల ఎకరాలకుగానూ ఏడు వేల ఎకరాల్లో విత్తనం పడింది. సత్యసాయి జిల్లాలో ఎనిమిది వేల ఎకరాలకుగానూ వంద ఎకరాల్లోనే ఆముదం పంట సత్యసాయి జిల్లాలో సాగైంది. ఇలా అన్ని రకాల పంటల సాగు నామమాత్రంగానే ఉంది.

జులై నెల మొత్తం వర్షాభావమే

పంటల సాగుకు కీలకమైన జులై నెలలో మొత్తం వర్షాభావ పరిస్థితులే నెలకొన్నాయి. అనంతపురం జిల్లాలో 32 మండలాలుంటే కేవలం మూడు మండలాల్లోనే వర్షపాతం సాధారణంగా పడింది. విడపనకల్లు, గుత్తి, గుంతకల్లు మండలాలు మినహా తక్కిన అన్ని మండలాల్లో వర్షాభావ పరిస్థితులే నెలకొన్నాయి. జులై నెలలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 19 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా పడినది 7.2 మిల్లీమీటర్లు మాత్రమే. సాధారణంలో 62 శాతం వర్షపాతం లోటుంది. ఇదే పరిస్థితి సత్యసాయి జిల్లాలోనూ నెలకొంది. సరైన పదును అసలైన సమయంలో కాకపోవడంతో ఖరీఫ్ పంటల సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోంది.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న విద్యాధికారులు, ఇన్‌సెట్లో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

నాణ్యమైన విద్య నినాదం కావాలి

◆ బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

◆ కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నాణ్యమైన విద్య మనందరి నినాదం కావాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ ఎంఇఒలకు సూచించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో గురువారం నాడు విద్యాశాఖ పరిధిలోని నేను బడికి పోతా, అకడమిక్ మానిటరింగ్ వింగ్, సివిల్, ఇంజినీరింగ్ పనులు, మధ్యాహ్న భోజనం, నాడు- నేడు, అదనపు తరగతి గదులు, తదితర అంశాలపై ఎంఇఒలు, విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాశాఖ పరిధిలోని అన్ని మండలాల్లోనూ ఎంఇఒలు ఒకేస్థాయి పనితీరు కనబరిచాలన్నారు. కెజిబివిల్లో పదవ తరగతి, ఇంటర్ ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉందని దీనిని పెంచాలన్నారు. అకడమిక్ మానిటరింగ్ వింగ్ కింద జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా ఎస్‌జిటిలు, అంగన్వాడీ టీచర్లకు పూర్తిస్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, షెడ్యూల్ వచ్చిన తర్వాత ట్రైనింగ్ చేపట్టాలన్నారు. జిల్లాలో విద్యార్థులకు కిట్ల పంపిణీకి సంబంధించి నోట్ పుస్తకములు పంపిణీ పూర్తి కాగా, మిగిలిన యూనిఫామ్స్, బ్యాగ్, బెల్ట్, డిక్షనరీలు, బూట్లు, టెస్ట్‌బుక్‌లు త్వరితగతిన అందేలా చూడాలన్నారు. ఏ పాఠశాలలో కూడా మధ్యాహ్న భోజన పథకానికి వంట మనుషులు లేరు అనేది ఉండడానికి వీలులేదని, ఎక్కడైనా సమస్య వచ్చిన 24 గంటల్లోపు పరిష్కరించాలని డిఇఒను ఆదేశించారు. అన్ని పాఠశాలల్లో బయటికి వచ్చి తిని వెళ్లడం లాంటివి ఉండరాదని, పాఠశాలల్లోనే భోజనం అందించాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో వరలక్ష్మి, విద్యాశాఖ ఏడీలు కృష్ణయ్య, నాగరాజు, ఎఎంఒ చంద్రశేఖర్ రెడ్డి, సీఎంవో గోపాల్, జిసిడివో వాణిదేవి, కార్యాలయం సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న రైతు సంఘాల నాయకులు

2023 ఖరీఫ్, రబీ ఇన్సూరెన్స్ ప్రకటించాలి

18, 19 తేదీల్లో సచివాలయాల వద్ద నిరసనలు

ఎపి రైతు సంఘం నేతలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రైతులకు 2023 ఖరీఫ్, రబీ ఇన్సూరెన్స్ మొత్తం తక్షణమే ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.బాలరంగయ్య, ఎం.క్రిష్ణమూర్తిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2023 ఖరీఫ్, రబీలో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, సకాలంలో వర్షాలు కురవక సాగు చేసిన వేరుశనగ, పప్పుశనగ, మిరప, పత్తి, ఆముదం, జొన్న, కొర్ర, మొక్కజొన్న, సజ్జ, పొద్దు తిరుగుడు, మినుములు, పెసలు, అలసందలు, సోయాబీన్, ఉలవలు, తెల్ల కుసాలు ఇతర పంటలకు పూర్తిగా నష్టం జరిగిందన్నారు. ఆయకట్టు కింద సాగు చేసిన మిరప పంటకు చివరలో నీరు అందక తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. పెట్టిన పెట్టుబడులు కూడా రాక చేసిన అప్పులు తీర్చలేక దిక్కుతోచని పరిస్థితిలో అన్నదాతలు ఉన్నారని తెలిపారు. జిల్లాలో రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతుల సమస్యల పరిష్కారించేందుకు ప్రభుత్వం ఒత్తిడి పెంచేందుకు ఈ నెల 18, 19వ తేదీల్లో గ్రామ సచివాలయాల వద్ద నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పనులు కల్పించి, రూ.600 రూపాయలు వేతనం ఇవ్వాలన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. ఈ నెల 18, 19వ తేదీల్లో గ్రామ సచివాలయం ఎదుట నిర్వహించే నిరసనలకు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



నగరంలో శాంతిర్యాలీ నిర్వహిస్తున్న వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు, వాల్మీకులు

బాలిక అత్యాచార నిందితులను ఉరితీయాలి

చిన్నారి వాసంతి మృతిని నిరసిస్తూ నగరంలో శాంతిర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం, ఎల్లాల (ముచ్చుమర్రి) గ్రామంలో ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను ఉరితీయాలని జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ డిమాండ్ చేశారు. బాలిక హత్యను నిరసిస్తూ వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం నగరంలోని టవర్‌క్లాక్ నుంచి డీఎస్పీ కార్యాలయం వరకూ కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభంశుభం తెలియని ఎనిమిదేళ్ల బాలికపై ముగ్గురు బాలురు అత్యాచారం చేయడంతోపాటు హత్య చేసి కాలువలో పడేయడం అమానుషమన్నారు. ఇంత కర్కశంగా, రాక్షసంగా ప్రవర్తించడానికి కారణాలు ఆలోచిస్తే భయం వేస్తోందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకూడదు నిందితులను ఉరితీయాలని డిమాండ్ చేశారు. అంతేగాకుండా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ ర్యాలీలో రాష్ట్ర యువసేన అధ్యక్షులు చంద్రచర్ల హరి, వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్.సి.అకులప్ప, ఇతర సంఘ సభ్యులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.



రైతులకు సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రైతులు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. గురువారం మండలంలోని రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్‌జి.రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం, అఖిల భారత సమన్వయ వాతావరణ వ్యవసాయ పథకం ఆధ్వర్యంతో షెడ్యూల్ కులాల రైతులకు వ్యవసాయ ఉపకరణ పనిముట్లను (టర్పలిన్ పట్టలు, స్ప్రేయర్) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాస్త్రవేత్తలు అందచేస్తున్న వ్యవసాయ, ఉద్యాన పంటల్లో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు పాటించి అదిక దిగుబడులు పొందాలని సూచించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌శంకర్‌బాబు మెట్ట వ్యవసాయంలో నేల, నీటి సంరక్షణ, నూతన వంగడాలు, వ్యవసాయ యాంత్రీకరణ, వ్యవసాయంలో విత్తనం విత్తినప్పటి నుంచి కోత వరకూ ఎలా ఉపయోగించాలో క్లుప్తంగా వివరించారు. డాక్టర్ జి.నారాయణస్వామి వాతావరణ ఆధారిత సలహాలు, వాతావరణ మార్పుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు పసుపుల హనుమంతురెడ్డి, ఓబుళపతి, ఆదినారాయణ, ఎంఆర్‌పిఎస్ నాయకులు చిన్న ఆంజనేయులు, టిడిపి కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలనే వినియోగించాలి

అనంతపురం కార్పొరేషన్ : వినాయక చవితి పండుగకు మట్టి వినాయకుని మాత్రమే వినియోగించాలని కమిషనర్ మేఘస్వరూప్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు విగ్రహాల తయారీదారులు హస్త కళాకారులు పర్యావరణ కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని మట్టితో చేసిన వినాయకుల ప్రతిమలు మాత్రమే తయారు చేయాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ప్లాస్టిక్ థర్మకోల్ లేకుండా విగ్రహాలు తయారు చేసే సమయంలో ఎటువంటి విషపూరితమైన పదార్థాలను ఉపయోగించకూడదన్నారు. విగ్రహాల తయారీ చేసే సమయంలో పర్యావరణ అనుకూలమైన ముడి పదార్థాలను ఉపయోగించడం వల్ల నీరు కాలుష్యం కాకుండా నివారించడంలో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మమత

విద్యతోనే బంగారు భవిష్యత్తు

జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మమత

ప్రజాశక్తి-వజ్రకరూరు

క్రమశిక్షణతో కూడిన విద్య ద్వారానే విద్యార్థులు బంగారు భవిష్యత్తును నిర్మించుకోవచ్చని ప్రిన్సిపాల్ మమత పిలుపునిచ్చారు. గురువారం ఉరవకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలబాలికలకు వేరువేరుగా భవిష్యత్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ కెరీర్‌కు సంబంధించిన విషయాలు తెలుసుకుని ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భవిష్యత్ సంస్థ ప్రతినిధులు బయపరెడ్డి, రామాంజనేయులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శివప్రసాద్, ఖాదర్, జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు, పద్మావతి, అరుణ, సీనియర్ అధ్యాపకులు ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-నార్పల

ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉండాలని డిఎఫ్ఒ లింగమయ్య సూచించారు. గురువారం మండల పరిధిలోని గూగూడు గ్రామంలో దుకాణదారులకు అగ్ని ప్రమాదాలపై ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గూగూడులోని దుకాణదారులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. అనంతరం అగ్నిమాపక నిరోధక శాఖ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రమణకుమారి శివయ్య, ఎంపిడిఒ రాముడు, ఇఒఆర్‌డి శైలజ, ఆలయ కార్యనిర్వహణ అధికారిణి శోభ, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, అధికారులు, దుకాణదారులు, అగ్నిమాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గూగూడు ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

ఎస్పీ గౌతమిసాలి

ప్రజాశక్తి-నార్పల

గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా ముగిసేంత వరకూ పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ గౌతమిసాలి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం గూగూడు గ్రామాన్ని ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గూగూడులో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ప్రధాన ఘట్టాలైన చిన్న సరిగెత్తు, పెద్ద సరిగెత్తి, జలధి కార్యక్రమాలకు భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగానే భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. అనంతరం కుళ్లాయిస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. తర్వాత ఆలయాల పరిసరాలు, అగ్నిగుండం, పికెట్లు, బందోబస్తు పాయింట్లు, గ్రామంలోని రహదారులు, పార్కింగు స్థలాలను పరిశీలించారు. స్థానిక పోలీసులతోపాటు జిల్లా హెడ్ క్వార్టర్స్ నుంచి ఏ.ఆర్, స్పెషల్ పార్టీ సిబ్బందిని ఇక్కడి విధుల్లో ఉంచుతామన్నారు. గూగూడులో 25 సిసిటీవీలు పని చేస్తున్నాయన్నారు. వీటిని అనుసంధానిస్తూ కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళలు, చిన్నారుల కోసం ప్రత్యేకంగా 24/7 విధుల్లో ఉండేలా మహిళా సిబ్బందిని కేటాయించామన్నారు. పిక్ ప్యాకెటింగ్, దొంగతనాలు, తదితర నేరాలు జరుగకుండా క్రైం పార్టీలను రంగంలోకి దింపుతామన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ బి.వి.శివారెడ్డి, నార్పల ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, ఎంపిడిఒ రాముడు, సర్పంచి రమణకుమారి శివయ్య, ఆలయ కార్యనిర్వహణాధికారి శోభ, గ్రామస్తులు పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ గౌతమీసాలి

కుళ్లాయిస్వామిని దర్శించుకున్న గుంతకల్లు ఎమ్మెల్యే

కుళ్లాయిస్వామి ఉత్సవాల్లో భాగంగా గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు, కార్యనిర్వహణాధికారి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయనతోపాటు నాయకులు ఆకుల అనిల్, ఆకుల రవితేజ, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

స్థిరమైన ధరలకు కందిపప్పు, సన్నబియ్యం

ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని రైతుబజార్‌లో స్థిరమైన ధరలకే బియ్యం, కందిపప్పు విక్రయాలను చేపడుతున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక రైతు బజార్‌లో స్థిరమైన ధరలకు నిత్యావసర వస్తువులను అందించేందుకు ఏర్పాటు చేసిన దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబజార్‌లో కందిపప్పు రూ.160, సన్నబియ్యం రూ.48కే విక్రయిస్తున్నామని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా నిత్యావసర వస్తువుల ధరలను సైతం తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపడతామని తెలిపారు. ధరల నియంత్రణే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మేఘ స్వరూప్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.



కందిపప్పును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 32 షాపులు సీజ్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో అధిక మొత్తంలో బకాయిలు పేరుకుపోవడంతో గురువారం 32 షాపులు సీజ్ చేసినట్లు అదనపు కమిషనర్ హరిబాబు, రెవెన్యూ ఆఫీసర్ సతీష్‌కుమార్ తెలిపారు. ఈమేరకు గురువారం స్థానిక మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 32 దుకాణాల లీజుదారులు నగర పాలక సంస్థకు బాడుగలు చెల్లించకుండా ఆదిక మొత్తంలో బకాయిలు పడ్డారన్నారు. బకాయిలు వసూలు చేసే క్రమంలో వారికి బకాయిలు చెల్లించేందుకు పలుమార్లు నోటీసులు ఇచ్చామన్నారు. ఈ నోటీసులకు డీజిల్ నుంచి సమాధానం రాకపోవడంతో కమిషనర్‌గా ఉత్తర్వుల మేరకు న్యూ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 32 దుకాణాలను సీజ్ చేసినట్లు తెలిపారు. బకాయి మొత్తం వారంరోజుల లోపు చెల్లించాలని, లేనిపక్షంలో పంచనామా చేసి దుకాణాల్లోని సామగ్రిని వేలం వేయనున్నట్లు తెలిపారు.



దుకాణాలను సీజ్ చేస్తున్న అధికారులు

కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పరిశీలన

స్వయంగా పర్యవేక్షిస్తున్న కార్యనిర్వాహణాధికారి శోభ

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడులో వెలసిన కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారిణి సాకేతపురం శోభ దగ్గరుండి పర్యవేక్షించారు. ఇందులో భాగంగా తోరణాలు, లైటింగ్, పారిశుధ్యం పనులు, భక్తుల క్యూలైన్లు తదితర పనులను వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అధికారులు, కార్మికులతో సమన్వయం చేసుకుంటూ పనులు చేయిస్తున్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారిణి శోభ మాట్లాడుతూ ఆలయ కార్యనిర్వహణ అధికారిణిగా తాను బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సంప్రదాయబద్ధంగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కుళ్లాయిస్వామి ఉత్సవాలు మత సామరస్యానికి, రాజకీయాలు, వర్గాలు, కులాలు, మతాలకతీతంగా ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. ఉత్సవాలు తిలకించడానికి దేశవ్యాప్తంగా భక్తులు భారీ ఎత్తున తరలిరానున్న నేపథ్యంలో ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు.



ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇఒ శోభ

గ్రామస్తులు, గ్రామపెద్దలు, గ్రామ యువకులు, అధికారులు, అనధికారులు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు.

మొక్కలను నాటి సంరక్షించాలి

జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి ఒక్కరూ మొక్కను నాటడంతోపాటు సంరక్షించాల్సిన బాధ్యతను తీసుకోవాలని జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్ పిలుపునిచ్చారు. 'వన మహోత్సవం, తలి పేరు మీద ఒక చెట్టు' కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం ఆత్మకూరు మండలంలోని పంపనూరు నగరవనంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా డిఎఫ్ఒ మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. మొక్కలు నాటేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాసులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా అటవీశాఖ అధికారుల ఆదేశాల మేరకు గురువారం మండలంలోని మడుగుపల్లి ప్రభుత్వం హైస్కూల్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, అటవీ సిబ్బంది జి.వెంకటరమణ, గయాజుద్దీన్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రామాంజనమ్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని చెలిమేపల్లి అంగన్వాడీ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం గర్భవతులు, బాలింతలు, ప్రజలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హరిత అనంత ప్లాంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా అంగన్వాడీ కేంద్రం ముందు మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త మంజుల, సహాయకురాలు ద్రాక్షయణి, గర్భవతులు, బాలింతలు, ప్రజలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : స్థానిక అంగన్వాడీ సెంటర్-2లో అంగన్వాడీ సూపర్‌వైజర్ రామలక్ష్మమ్మ ఆధ్వర్యంలో హరిత అనంత ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అంగన్వాడి పామిడి సెక్టార్ తరుపున అంగన్వాడీ సెంటర్1, 2, మిగిలిన అన్ని అంగన్వాడీ సెంటర్లలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు జెఎల్.నారాయణమ్మ, పి.రెహనా, ఆయాలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలను నాటిస్తున్న జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్

శింగనమల : మండల పరిధిలోని పెరవలి అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ఉమాదేవి ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రమణమ్మ, టి.రత్నమ్మ, ప్రసన్నరాణి, హెల్పర్ అరుణ, తల్లులు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు : మొక్కలను పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అగ్నిమాపక సీఐ భీమలింగయ్య పిలుపునిచ్చారు. గురువారం ఉరవకొండ అగ్ని మాపక కార్యాలయ ప్రాంగణంలో జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేష్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

బాలిక అత్యాచార నిందితులను శిక్షించాలి

వాల్మీకి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గంగాధర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

చిన్నారి వాల్మీకి వాసంతిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన నిందితులను ఉరితీయాలని వాల్మీకి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నారాయణస్వామి డిమాండ్ చేశారు. గురువారం రుద్రంపేట వాల్మీకి కళ్యాణ మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సభ్యసమాజం తలదించుకునే విధంగా చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేశారని తెలిపారు. నంద్యాల జిల్లా, పగిడ్యాల మండలం, ముచ్చుగిరి పార్క్‌లో ఆడుకోవడానికి వెళ్లిన తొమ్మిదేళ్ళ వాల్మీకి వాసంతిని ముగ్గురు మైనర్ బాలురు తీసుకెళ్ళి అత్యాచారం, హత్య చేసి కాలువలో పడేశారని తెలిపారు. మైనర్‌లైన నరరూప రాక్షసులను మరణశిక్ష విధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగుల సంఘం జిల్లా కోశాధికారి కిషోర్, ఉపాధ్యక్షులు సుధాకర్, కష్ణమూర్తి, సీనియర్ నాయకులు నరహరి, రమణ, శ్రీధర్, ఓబులేసు, సూర్యనారాయణ, గోవిందు, ల్యాబ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న గంగాధర్

కబడ్డీలో కేంద్రీయ విద్యాలయం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

కేంద్రీయ విద్యాలయ సంఘటన్ వార్షికంగా నిర్వహించే కబడ్డీ పోటీల్లో జిల్లాకేంద్రంలోని ఎస్‌కెయు వద్ద ఉన్న కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇందులో భాగంగా గుంటూరు కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన హైదరాబాద్ రీజినల్ కబడ్డీ పోటీల్లో ఎస్‌కెయు అనంతపురం కేంద్రీయ బాలికల కబడ్డీ జట్టు, కెవి.గచ్చిబౌలి జట్టుపై గెలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. అనంతపురం జట్టులో భాను మహేశ్వం, లిఖిత, మహిమ జ్యోతి, చిన్మయి ప్రతిభ కనబరిచి జాతీయ జట్టుకు ఎంపికైనట్లు కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ కరీంఖాన్ తెలిపారు.



కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు

పంచాయతీ కార్మికుడికి ఆర్థికసాయం

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్మికుడిగా పని చేస్తున్న సి.ఓబులపతికి ఆర్థికసాయం అందజేశారు. వెన్నెముక నొప్పి, నరాల బలహీనతతో ఇబ్బంది పడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకున్న సర్పంచి పార్వతి, పంచాయతీ కార్యదర్శి సాదిక్‌వలి, సిబ్బంది కలిసి ఆసుపత్రికి వెళ్లి రూ.20వేల సాయం అందజేశారు.



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

రాజకీయాలు, పార్టీలకతీతంగా పేదలకు ఇళ్లు

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వం ఆధ్వర్యంలో పేదలకు అందించే ఇల్లు, ఇళ్ల స్థలాల పంపిణీలో రాజకీయాలు, పార్టీలకు అతీతంగా అర్హులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ఎన్డీఏ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. గత ప్రభుత్వంలో అసంపూర్తిగా మిగిలిన ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని అన్నారు. నగర సమీపంలోని ఆలమూరు లేఔట్‌లో అనంతపురం అర్బన్ లబ్ధిదారుల కోసం నిర్మిస్తున్న ఇళ్లను గురువారం పరిశీలించారు. ఎమ్మెల్యేతో పాటు హౌసింగ్, మున్సిపల్, విద్యుత్ శాఖలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఇప్పటి వరకు ఎన్ని ఇళ్లు ప్రారంభించారు, ఎన్ని పూర్తి చేశారు, లబ్ధిదారులకు ఎన్ని ఇచ్చారు, అక్కడ నాణ్యతా ప్రమాణాలు, మౌళిక వసతుల కల్పన ఇలాంటి అన్ని అంశాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దగ్గుపాటి మీడియాతో మాట్లాడుతూ గతంలో వైసీపీ నాయకులు చెప్పినట్టుగా పరిస్థితి ఇక్కడ లేదన్నారు. ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్మిస్తున్నారని, ఇప్పటికే 7 వేల ఇళ్ల నిర్మాణం చేపడితే 1200 మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన వాటిని నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించామన్నారు. ఇప్పటి వరకు నిర్మించిన వాటిలో నాణ్యతాలోపం స్పష్టంగా కనిపిస్తోందని, కనీసం ఇప్పటి నుంచి చేపట్టే నిర్మాణాలైనా సరిగా చేయాలని కోరారు. నగరంలో కూడా చాలా మంది ఇళ్లు కావాలని అడుగుతున్నారని, ఇక్కడ వెయ్యి వరకు ఉన్నాయని, వీటిని త్వరలోనే లబ్ధిదారులకు అందిస్తామన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు ఇస్తామన్నారు. ఇందులో టీడీపీ, వైసీపీ అన్న తేడాలు ఉండవన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అలాగే హౌసింగ్ విభాగంలో జరిగిన అక్రమాలపై త్వరలోనే విచారణకు ఆదేశిస్తామని, బాధ్యులపై కచ్చితంగా చర్యలుంటాయని హెచ్చరించారు.

ఎమ్మెల్యేను కలిసిన అపుస్మా నాయకులు

అనంతపురం : అపుస్మా అసోసియేషన్ అధ్యక్షుడు పులారెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ చంద్ర ఆధ్వర్యంలో గురువారం అనంతపురంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రములో అపుస్మా గౌరవాధ్యక్షులు నాయుడు, స్టేట్ కన్వీనర్ నాగరాజు, టౌన్ ప్రెసిడెంట్ శ్రీనాథ్, సూర్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జలీల్, అన్వర్, లక్ష్మణ్, రఘునాథ్‌రావు, రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పులివెందులకు బస్సులు నడపాలని వినతి

తాడిపత్రి రూరల్ : తాడిపత్రి నుంచి యల్లనూరు మీదుగా సింహాద్రిపురం, పులివెందులకు బస్సులు నడపాలని రైతుసంఘం నాయకులు రాజారామిరెడ్డి కోరారు. ఈమేరకు గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో నిర్వహించినయ డయల్ యువర్ డిఎం నిర్వహించగా సమస్యను ఫోన్ ద్వారా డిఎం దృష్టికి తీసుకొచ్చారు. యల్లనూరుకు ఎక్కువగా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనికితోడు యల్లనూరు మీదుగా పులివెందులకు బస్సులు నడపకపోవడం వల్ల ఎక్కువగా ప్రయివేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. దీంతో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. కావున యల్లనూరు మీదుగా సింహాద్రిపురం, పులివెందులకు బస్సులు నడపాలని కోరారు.

కొలువుదీరిన పీర్లు

రాయదుర్గం : మోహర్రం వేడుకల్లో భాగంగా పట్టణంలోని లడ్డువారి పీర్ల చావిడిలలో పీర్లు కొలుదీరాయి. ఈ సందర్భంగా ముజావర్ లడ్డు అబ్దుల్ శుకూర్ మాట్లాడుతూ 14న చిన్న సరిగెత్తు, 16న పెద్ద సరిగెత్తు, 17న జలధి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూర్ మొహమ్మద్, లడ్డు ఖాసీం, లడ్డు మహమ్మద్ షఫీ, ఛమ్మ అహ్మద్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో అక్రమాలను అరికట్టాలి

టిడిపి నాయకులు ఆకుల అనిల్



వినతిపత్రం సమర్పిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో చోటు చేసుకున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు ఆకుల అనిల్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ రాముడుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇవ్వాల్సిన పట్టాలు చాలామంది అనర్హులు దక్కించుకున్నారన్నారు. అంతేగాకుండా అక్రమంగా నిర్మాణాలు కూడా చేపట్టారన్నారు. కావున వాటిపై చర్యలు తీసుకుని అర్హులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రసాద్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విజయసాయి కుమార్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-అనంతపురం

నైజీరియకు చెందినా గుడ్ సమారిటన్ థియోలాజికల్ సెమినరీ(ఐఎస్‌సి), మనం ఫౌండేషన్ సమాజ సేవ చేస్తు మరియు వివిధ రంగాల్లో మంచి ప్రావీణ్యం కలిగిన వారికి, మానవత్వం, శాంతియుత మానవ హక్కుల కోసం కృషి చేస్తున్న వారికి డాక్టరేట్‌ను అందిస్తున్నారు. ఇందులో భాగంగా అనంతపురానికి చెందిన సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయసాయి కుమార్‌కు ఈ డాక్టరేట్‌ను అందించారు. గురువారం నాడు మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, సినీనటుడు సుమన్, ప్రముఖ జ్యోతిషులు దైవజ్ఞ శర్మ, సినీ నిర్మాత కెవిఎస్.చౌదరి, సుబ్బ రెడ్డి, చక్రవర్తి చేతుల మీదుగా హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత భవన్‌లో అందజేసారు. ప్రతి నిత్యం ఎంతో మంది అనాథలు, అభాగ్యులు సేవకు కృషి చేస్తున్న విజయసాయి కుమార్‌కు డాక్టరేట్ అందించి సత్కరించారు. ఇక నాట్య విభాగంలో అనంతపురం ఓం సంగీత నత్య కళాశాల వ్యవస్థాపకులు దేవరకొండ కౌసల్య, రచయిత కంబదూరు నబీరసూల్ కూడా సత్కారం అందుకున్నారు.



డాక్టరేట్ అందుకుంటున్న విజయసాయికుమార్

మృతుని కుటుంబానికి పరామర్శ

పామిడి : అనారోగ్యంతో మృతిచెందిన 8వ వార్డుకు చెందిన రిక్షా ఓబులేసు కుటుంబాన్ని ఎమ్మెల్యే ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, తనయుడు ఈశ్వర్ ఆదేశాల మేరకు టిడిపి నాయకుడు ఆర్‌ఆర్.రమేష్ మృతుని కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. మృతుడి కుటుంబానికి గుమ్మనూరు కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పిస్తూ రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు గురువారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు గౌరీ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సౌధామణి, సుబ్రమణ్యం, కిష్టప్ప, జగన్నాథ్, నల్లప్ప, మణిదీప్, లక్ష్మీనారాయణ, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ డిఎం

రాయదుర్గం : ఈనెల 13న శనివారం సాయంత్రం 4 నుంచి 5 ఐదు గంటల వరకూ డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎపిఎస్ ఆర్‌టిసి రాయదుర్గం డిపో మేనేజర్ కె.సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయదుర్గం ప్రాంతంలో ఆర్టీసీ రవాణా సౌకర్యాలు, సమస్యలు, సూచనలు, సలహాల కోసం 99592 25863 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

14న ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని పశువైద్యశాలలో ఈనెల 14న యాంటి రేబిస్ వ్యాధి నివారణ వాక్సిన్ (పిచ్చికుక్క కాటు వ్యాధి)ను ఉచితంగా వేయనున్నట్లు పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పెంపుడు జంతువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైల్వే సీనియర్ డిఎంఇ గా ప్రమోద్



గుత్తి : రైల్వే గుత్తి డీజిల్ షెడ్‌లో డీజిల్ మెకానికల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ప్రమోద్‌కు సీనియర్ డీజిల్ మెకానికల్ ఇంజనీర్‌గా పదోన్నతి దక్కింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి దక్కడం ఆనందదాయకమని సీనియర్ డీఎంఇ ప్రమోద్ తెలిపారు. విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తామని చెప్పారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

గుత్తి: ప్రతిఒక్కరూ మొక్క లు నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని పరి రక్షించుకోవచ్చని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరుడు నారాయణ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని రజాపురం గ్రామం వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో సిక్ (అనారోగ్యం) విద్యార్థినుల కోసం నాలుగు మంచాలను విరాళంగా అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థినులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ విరివిగా మొక్కలు పెంచడం ద్వారా వాతావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎంకె.చౌదరి, జక్కలచెరువు ప్రతాప్, రియాజుద్దీన్, చికెన్ శీనా, సర్పంచి యు.లింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో కలిసి మొక్క నాటుతున్న గుమ్మనూరు నారాయణ

ప్రమాద బాధితునికి ఆర్థికసాయం

నార్పల : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నార్పలకు చెందిన ధనుంజయ కుటుబానికి శివక్రిష్ణ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బొందలవాడ శివకృష్ణచౌదరి గురువారం ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సూరి, రవి, తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ పార్క్ పునరుద్ధరణ అభినందనీయం

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం నగరపాలక సంస్థ ఆధీనంలో ఉన్న సెంట్రల్ పార్క్ స్థలం అన్యాక్రాంతం కాకుండా ఆహ్లాదకరమైన సుందరమైన పార్క్‌ను పునరుద్దరించేందుకు అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తీసుకున్న నిర్ణయం హర్షనీయంగా ఉందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ ఛైర్మన్ బిసిఆర్.దాస్ అన్నారు. సెంట్రల్ పార్క్‌ను ఎమ్మెల్యే సందర్శించి ఆక్రమిత స్థలాలను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించడాన్ని ఎమ్మార్పీఎస్ స్వాగతిస్తోందని అన్నారు. సెంట్రల్ పార్క్ నిర్మాణం సమయంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు శ్రమదానం చేశారని గుర్తు చేశారు. పార్క్ స్థలాన్ని అక్రమించుకోవడం అనేది సహించరానిదన్నారు.

ఉచిత గర్భకోశ శిబిరం

బుక్కరాయసముద్రం : పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని అమ్మవారిపేట గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుక్కరాయసముద్రం సహాయ సంచాలకులు రత్నకుమార్ మాట్లాడుతూ 45 గర్భకోశ సంబంధిత వ్యాధులకు చికిత్స చేయడంతోపాటు తిరిగి గర్భం దాల్చేందుకు కావాల్సిన మందులను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా దాదాపు రూ.17వేలు విలువజేసే మందులను ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఒ సుధాకర్, మండల పశువైద్యాధికారి పెద్దన్న, పశువైద్య సహాయకులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.



దాణా పంపిణీ చేస్తున్న అధికారులు

డెంగీ నివారణ అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, విద్యార్థులు

శింగనమల : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం మండల పరిధిలోని తరిమెలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తరిమెల పిహెచ్‌సి వైద్యాధికారి శంకర్నాయక్ మాట్లాడుతూ చిన్న కుటుంబం చింతలేని కుటుంబం అన్నారు. కావున జనాభా నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమం ఎంపిడిఒ రమణ, సిహెచ్ఒ గంగాధర్, సూపర్‌వైజర్ అశ్వర్థనారాయణ, ఆరోగ్య కార్యకర్తలు నాగరాజు, శైలజ, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి విద్యార్థినుల ఎంపిక

శింగనమల : మండలం కేంద్రంలోని శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ఇద్దరు విద్యార్థినిలు ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారు. పి.సుదీక్షరెడ్డి నూజివీడు ట్రిపుల్ ఐటీకి, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటికి కె.అంజూమ్ ఎంపికైనటుల ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ తెలిపారు.



ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

రాయదుర్గం : పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భవించి నేటికీ 72ఏళ్లు పూర్తవుతుందన్నారు. యూనియన్ ఆవిర్భవించినప్పటి నుంచి నేటి వరకూ కార్మికులు, ఉద్యోగుల విషయాల్లో అనేక పోరాటాలు చేసి సమస్యలను పరిష్కరించామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సురేష్ బాబు, సిపిఐ రాయదుర్గం తాలూకా కార్యదర్శి నాగార్జున, టిడిపి పట్టణ అధ్యక్షులు పసుపులేటి రాజు, యూనియన్ నాయకులు శ్రీరాములు, ఎస్‌ఎస్.వలి, రామలింగ, కెటి.రెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

'ప్రపంచ జనాభా దినోత్సవం' సందర్భంగా నగరంలోని భాష్యం విద్యాసంస్థల విద్యార్థులు గురువారం ర్యాలీని నిర్వహించారు. నగరంలోని తెలుగుతల్లి విగ్రహం నుంచి మున్సిపల్ కార్యాలయం, సప్తగిరి సర్కిల్, మీదుగా తిరిగి భాష్యం స్కూల్ వరకూ ర్యాలీ సాగింది. ఇందులో భాగంగా జనాభాను అదుపు చేయాలని, మొక్కలను పెంచాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే మొక్కలు నాటడం అలవర్చుకోవాలన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ రామకృష్ణ, సీఈఓ అనిల్‌కుమార్, భాష్యం విద్యాసంస్థల జిల్లా జెడ్ఇఓ రవివర్మ పాల్గొన్నారు.

అలాగే వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకూ విద్యార్థులు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఇబి.దేవి, వైద్యశాఖ ప్రోగ్రాం అధికారులు సుజాత, యుగంధర్, నారాయణస్వామి, గంగాధర్‌రెడ్డి, రవిశంకర్, మలేరియా అధికారి ఓబులు, స్టాటిస్టికల్ అధికారి మహమ్మద్ రఫీ, డెమో ఇన్‌ఛార్జి త్యాగరాజు, డిప్యూటీ హెల్త్ ఆఫీసర్ గంగాధర్, డీఎస్ఒ గౌడ్, ఏఎస్ఒ లక్ష్మీనరసమ్మ, హెచ్ఇఒ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : జనాభా పెరుగుదల అనార్థాలకు మూలమని ఆవులదట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం మండల పరిధిలోని వడ్రవనూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జనాభా పెరుగుదల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామాంజనేయులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. కాగా స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ఆర్థికశాస్త్ర విభాగం, జాతీయ సేవాపథక విభాగాల ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు.

కుందుర్పి : ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ చాంద్‌బేగం ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా 'ఇద్దరు పిల్లలు ముద్దు.. ముగ్గురు హద్దు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలో 143 కోట్ల జనాభాతో భారతదేశం మొదటి స్థానంలో ఉందన్నారు. జనాభా పెరగడం వల్ల భవిష్యత్తు తరాలకు అన్నిరంగాల్లో నష్టం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రకరూరు : ఉరవకొండ, వజ్రకరూరు మండల కేంద్రాల్లో పంచాయతీ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద గురువారం ప్రపంచ జనాభా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గురుప్రసాద్, మేజర్ పంచాయతీ కార్యదర్శి గౌస్ సాహెబ్, భక్తుల కోదండరామిరెడ్డి, సత్యనారాయణ, సూపర్‌వైజర్ నాగశంకర్, ఎంఎల్‌హెచ్‌పిలు సుధామాధురి, నిర్మల, మణి, ఏఎన్ఎం సుకన్య, జ్యోతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

బెలుగుప్ప : ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్ కార్యక్రమంలో భాగంగా ప్రపంచ దినోత్సవంపై గర్భిణులకు అవగాహన కల్పించారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తిపై దాడికి యత్నం

రాయదుర్గం : పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఉన్న ఎస్‌ఎల్‌వి మెడికల్ షాప్ సమీపంలో గుమ్మఘట్ట మండలం రంగచేడు గ్రామానికి చెందిన హరిజన తిప్పేస్వామిపై కొందరు వ్యక్తులు గురువారం దాడికి పాల్పడ్డారు. ఈనెల 2వతేదీన లక్ష్మీబజార్‌లోని పెట్రోల్ బంకు వద్ద రాయదుర్గం మండలం కొంతానపల్లి గ్రామానికి చెందిన మైలారి, అతని బంధువులు హరిజన తిప్పేస్వామిపై దాడికి పాల్పడ్డారు. ఈ సందర్భంగా గాయపడిన తిప్పేస్వామి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందాడు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా పాత కక్షలు మనసులో పెట్టుకుని తిరిగి గురువారం తిప్పేస్వామిపై మైలారి, అతని అనుచరులు దాడికి పాల్పడగా ఇరుగుపొరుగు వారిని సర్ది చెప్పి పంపారు. కాగా తనకు మైలారి మరియు అతని బంధువుల నుండి ప్రాణహాని ఉందని తనను వారి నుండి రక్షించాలని తిప్పేస్వామి పోలీసులను మొరపెట్టుకున్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి : మండలంలోని ఎంగిలిబండ గ్రామ శివారులో 67వ జాతీయ రహదారిపై గురువారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఎంగిలిబండకు చెందిన రాము, చిన్న కుళ్లాయి ద్విచక్ర వాహనంలో పని నిమిత్తం పట్టణానికి బయలుదేరారు. అయితే గ్రామ శివారులో బస్టాప్ వద్ద వారు ప్రయాణిస్తున్న బైక్ అదుపు తప్పిబోల్తా పడింది. గమనించిన స్థానికులు తీవ్రంగా గాయపడిన ఇద్దరిని108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సకు అనంతపురానికి తరలించారు.